
సాక్షి కర్నూలు

శుక్రవారం । 18 । అక్టోబర్ । 2024



ఇదేమి మద్దతు !

శనగలకు కేంద్రం ప్రకటించిన మద్దతు ధరపై రైతుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పెట్టుబడులు పోగా తమకు మిగిలేది ఏమీలేదంటూ వాపోతున్నారు. 8లో ▸



గో సంరక్షణ నిధికి విరాళం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న గో సంరక్షణ నిధి పథకానికి గురువారం గుంటూరుకు చెందిన సురేష్ బండారు రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు.




టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,631.93
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 101.500
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 28,607
అవుట్ ఫ్లో	: 28,487

న్యూస్‌రీల్

శాస్త్రోక్తంగా సహస్ర కలశ క్షీరాభిషేకం



రాఘవేంద్రస్వామి బృందావనానికి క్షీరాభిషేకం గావిస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం: వేదమంత్రోచ్ఛారణల మధ్య రాఘవేంద్రస్వామి బృందవనానికి గురువారం సహస్ర కలశ క్షీరాభిషేకం వైభవోపేతంగా సాగింది. శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శాస్త్రోక్తంగా గంట పాటు కనుల పండువగా ఈ వేడుక సాగింది. పౌర్ణమి కావడంతో భక్తులు వేలాదిగా శ్రీమఠానికి తరలివచ్చి స్వామి సేవలో తరించారు. అనంతరం స్వామిజీ చేతుల మీదుగా ఫల, పూల, మంత్రాక్షింతలు అందజేసి ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో ఐడీఎఆర్‌సీ ఇంటర్నేషనల్ సంస్థ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

టెట్‌కు 345 మంది గైర్హాజరు

కర్నూలు సిటీ: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు 345 మంది గైర్హాజరయ్యారు. గురువారం జరిగిన పరీక్షకు ఉదయం 1,508 మందికి గాను 1,324 మంది హాజరు కాగా, 184 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌కు 1,507 మందికి గాను 1,346 మంది హాజరుకాగా 161 మంది గైర్హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

జల మండలి ఎస్‌ఈగా బాల చంద్రారెడ్డి

కర్నూలు సిటీ: జల వనరుల శాఖ కర్నూలు సర్కిల్‌లో డిప్యూటీ ఎస్‌ఈగా పని చేస్తున్న బి.బాల చంద్రారెడ్డికి ఎస్‌ఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సాయి ప్రసాదు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఇన్‌చార్జ్ ఎస్‌ఈగా పని చేస్తున్న రెడ్డి శేఖర్ రెడ్డి అనంతపురం జిల్లా తుంగభద్ర ఎగువ కాలువకు బదిలీ అయ్యారు. దీంతో వైఎస్సార్ జిల్లా చిన్న పారుదల శాఖ ఈఈగా పని చేస్తున్న ఈయన ఇటీవల డిప్యూటీ ఎస్‌ఈగా పదోన్నతి పొంది కర్నూలు సర్కిల్‌కు వచ్చిన బాల చంద్రారెడ్డికి ఎస్‌ఈగా బాధ్యతలు అప్పగించారు. గతంలో జిల్లాలో ఈయన కేసీ కాలువ ఈఈగా, చిన్న నీటిపారుదల శాఖ నంద్యాల డివిజన్ ఈఈగా పని చేశారు. ఎస్‌ఈగా నేడు బాధ్యతలు స్వీకరించనున్నారు.

హంద్రీనీవా ఈఈగా రాజన్‌బాబు..

హంద్రీనీవా సర్కిల్-1 డివిజన్-1 నందికొట్కూరు ఈఈగా పూర్తి అదనపు బాధ్యతలు గిరిపోగు రాజన్‌బాబుకు అప్పగించారు. గతంలో ఈఈగా పని చేస్తున్న పురుషోత్తం ఈ ఏడాది ఏప్రిల్‌లో రిటైర్ అయ్యారు. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న పోస్టులో అనంతపురం హంద్రీనీవా సుజల స్రవంతి సబ్ డివిజన్-7లో డిప్యూటీ ఎగ్జిక్యుటివ్ ఇంజనీర్‌గా పని చేస్తున్న రాజన్‌బాబుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దండి

కర్నూలు(సెంట్రల్): ఉల్లాస్ కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులను అక్షరాసులుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో ఉల్లాస్ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడిచే ఈ కార్యక్రమంలో 50 ఏళ్లలోపు నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చాలని, కనీసం చదవడం, రాయడం రావాలన్నారు. ఆసక్తి ఉన్న స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఉపాధ్యాయులు, సచివాలయాల ఉద్యోగులతో చదువు చెప్పించాలన్నారు. కార్యక్రమంలో వయోజన విద్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖరరెడ్డి, డీఈఓ శామ్యూల్, డీపీఓ భాస్కర్, ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మమ్మ, డీఆర్‌డీఏ ఏపీడీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు వెల్లువెత్తుతున్న టమాట

కర్నూలు(అగ్రికల్చర్): టమాట ధరలు తగ్గుతున్నాయి. మార్కెట్‌కు టమాట వెల్లువెత్తోంది. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో సాగు చేసిన పంట కోతకు రావడంతో దిగుబడులు మార్కెట్‌కు చేరుతున్నాయి. పత్తికొండ మార్కెట్‌కు గురువారం రికార్డు స్థాయిలో 101.53 టన్నుల టమాట వచ్చింది. బుధవారం కేవలం 67.55 టన్నులు మాత్రమే వచ్చింది. ఒక్క రోజులోనే 33.98 టన్నులు ఎక్కువగా వచ్చింది. కనిష్ట ధర రూ.1,500, గరిష్ట ధర రూ.3,500 లభించింది. సగటు ధర రూ.25 నమోదు అయింది. కర్నూలు రైతు బజారులో కిలో రూ.26 ప్రకారం విక్రయిస్తున్నారు. టమాట ధరలు దిగి వస్తుండటంతో రైతులు నిరాశకు గురవుతుండగా... వినియోగదారులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

అరాచకాలతో.. విస్కీపోతున్నారు!



☛ సార్.. కోడుమూరులోని మద్యం దుకాణం నెంబర్ 36 లక్కీడ్రాలో దక్కించుకున్నా! అదే రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు 9440246666 నెంబర్ నుంచి విష్ణువర్ధన్‌రెడ్డి ఫోన్ చేసి ఇంటికి వచ్చి కలవాలని ఆదేశించడంతో వెళ్లాము. దుకాణం అప్పగించాలని నోటికొచ్చినట్లు మాట్లాడారు. మేము 1983 నుంచి టీడీపీలోనే ఉన్నాం. ఇలా చేస్తే ఎలా? అని అడిగా! అయినా వినలేదు. షాపు మేమే నడుపుతామని చెప్పి వచ్చా! పదే పదే ఫోన్లు చేశారు. 'రవీంద్రవైన్స్' పేరుతో 16వ తేదీ ప్రారంభించాలని చూశాం. సాయంత్రం 6.30కి మళ్లీ విష్ణు ఫోన్ చేశారు. దుకాణం ప్రారంభిస్తే స్టాకు, దుకాణం మొత్తం స్వాధీనం చేసుకుంటామని మాటల్లో చెప్పలేని విధంగా తిట్టారు'' అని దుకాణ నిర్వాహకుడు వడ్డెంపూడి నరేశ్.. హోంమంత్రి అనిత, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఇన్‌చార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడుకు మెయిల్, వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేశారు.



Kollu Ravindra Sir

Kurnool District Shop No: KNL/36, Kodumuru.

From the starting day I am getting warning calls that to handover the shop to the concern kodumuru TDP Incharge - Sri. Vishnuvardhan Reddy Garu, we received a call on 14-10-2024 at 02:30 PM from Phone No: 9440246666 and informed that to meet him personally at his residency to discuss how to do further process of the shop and we

☛ 'సుంకేసులలో షాపు నెంబర్ 24 స్నేహితులైన విజయ్, భరత్ గౌడ్ దక్కించుకున్నారు. అయితే విష్ణువర్ధన్‌రెడ్డి అనుచరులు ఆ దుకాణం తమకు ఇచ్చి వెళ్లిపోవాలని బెదిరించారు. 'గతంలో దుకాణాలు కాల్చిన చరిత్ర మాది! మాకు అప్పగించి వెళ్లండి. తర్వాత మీకు ఏమివ్వాలో ఆలోచిస్తాం!' అని చెప్పలేని మాటల్లో బెదిరించారు. దీంతో వారు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అయినా బెదిరింపులు ఆగలేదు. రోజూ అనేక నెంబర్ల నుంచి బెదిరింపు ఫోన్లు వస్తూనే ఉన్నాయి. తాము చాలా చోట్ల వ్యాపారాలు చేశామని, ఇంత అన్యాయం ఎక్కడా చూడలేదని బాధితులు ఆవేదన చెందుతున్నారు. 80 అప్లికేషన్లకు రూ.1.60 కోట్లు ఖర్చు పెట్టామని, గుంటూరు, సుంకేసుల దుకాణాలు మాత్రమే దక్కాయని, ఇప్పుడు ఇక్కడ తెరనివ్వట్లేదని, ఏం చేయాలో అర్థం కాలేదంటూ బాధితులు ఆందోళన చెందుతున్నారు.

- టీడీపీ నేతల బెదిరింపులతో మద్యం దుకాణ లైసెన్స్‌దారుల బెంబేలు
- కోడుమూరులో తీవ్ర స్థాయికి చేరిన విష్ణు, అనుచరుల అరాచకాలు
- తెలంగాణ వాసులను మరింత ఇబ్బంది పెడుతున్న వైనం
- హోం, జిల్లా ఇన్‌చార్జ్, ఎక్సైజ్‌శాఖ మంత్రులకు బాధితుల ఫిర్యాదులు
- రూ. లక్షలు పెట్టుబడి పెట్టి దుకాణాలు ప్రారంభించలేని దుస్థితి

సాక్షిప్రతినిధి కర్నూలు: మద్యం దుకాణాలు దక్కించుకున్న లైసెన్స్‌దారులను తెలుగుదేశంపార్టీ నాయకులు ఏ స్థాయిలో బెదిరిస్తున్నారో పై.. ఉదాహరణలు చూస్తే స్పష్టమవుతోంది. ఇది కోడుమూరు మాత్రమే కాదు. కర్నూలు, నంద్యాల జిల్లాలోని చాలా నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి! లైసెన్స్‌లు ఎవ్వరు దక్కించుకున్నా, ఎమ్మెల్యేల వద్దకు వచ్చి మాట్లాడి దుకాణం అప్పగించడమో లేదా మామూళ్లు మాట్లాడుకుని వెళ్లడమే ఏదో ఒకటి చేయాలి. లేదంటే దుకాణం తెరిచే పరిస్థితి ఉండదు. ఉమ్మడి జిల్లాలోని 204 దుకాణాల్లో 16వ తేదీ 40 శాతం దుకాణాలు కూడా తెరవలేదంటే ఎంత దారుణ పరిస్థితి ఉంటో స్పష్టమవుతోంది. కొందరు దుకాణాలను ఇతరులకు విక్రయించేందుకు సిద్ధమవుతున్నా స్థానికంగా ఉన్న బెదిరింపుల నేపథ్యంలో దుకాణాలు తీసుకునేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని తెలంగాణ వాసులు వాపోతున్నారు. బెదిరింపులపై ఎక్సైజ్‌శాఖ, ఇన్‌చార్జ్ మంత్రులతో పాటు ఏకంగా హోంమంత్రికి ఫిర్యాదు చేశారు. కొందరు ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. అయినా వీరికి రక్షణగా ప్రభుత్వం నిలవడం లేదు. దీంతో తెలంగాణ వాసుల దృష్టిలో కర్నూలు జిల్లాలో 'అరాచక పాలన' నడుస్తోందనే భావన ఏర్పడింది. 'సీమ' వాసులు తెలంగాణకు వస్తే గొప్ప మర్యాద లతో చూసుకుంటాం! కానీ మమ్మల్ని మాత్రం హీనంగా చూస్తున్నారు!' అంటూ కొందరు బాధపడుతున్నారు. టీడీపీ నేతల చర్యలతో మొత్తం కర్నూలుకే మచ్చ ఏర్పడే రీతిలో వ్యవహరిస్తున్నారు. చివరకు తెలుగు తమ్ముళ్ల ఆగడాలను సీఎం చంద్రబాబు నాయుడు, చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్, కలెక్టర్ రంజిత్ బాషాకు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

నంద్యాల జిల్లాలో ఇదే పరిస్థితి

- ➤ శ్రీశైలంలో నియోజకవర్గంలో 17 దుకాణాలు ఉంటే, 12 షాపులు టీడీపీ నేతలకే దక్కాయి. తక్కిన వాటిలో 2 తెలంగాణ వారికి, మూడు ఇతరులకు దక్కాయి. ఇందులో సున్నిపెంట లైసెన్స్ తీసుకున్న తెలంగాణ వాసిపై బెదిరింపులకు దిగారు.
- ➤ బనగానపల్లెలో 21 దుకాణాలు ఉంటే 4 షాపులు మినహా తక్కినవన్నీ టీడీపీ నేతలకు దక్కాయి. తక్కిన వాటిని సైతం దక్కించుకునేందుకు బెదిరింపులకు దిగారు. వీటిలో ఓ దుకాణాన్ని లైసెన్స్‌దారుడు టీడీపీ నేతలకు అప్పగించేశాడు.
- ➤ నంద్యాలలో 17 మద్యం దుకాణాలు ఉన్నాయి. 11 టీడీపీ నేతలకు వచ్చాయి. మూడు తెలంగాణ వాసులకు, తక్కిన మూడు ఇతరులకు వచ్చాయి. ఇందులో రెండు దుకాణాలను మంత్రి ఫరూక్ అనుచరుల బెదిరింపులతో వారికే అప్పగించేశారు.

గదులు అద్దెకు ఇవ్వకుండా బెదిరింపులు

దుకాణాలు దక్కించుకున్న వ్యక్తులు టీడీపీ నేతల బెదిరింపులకు లొంగకపోతే దుకాణాల కోసం గదులు అద్దెకు ఇచ్చిన వారిని బెదిరిస్తున్నారు. 'స్టాకు తెచ్చిన తర్వాత దుకాణాలు తగలబెడతాం. మీ గదులు కూడా తగలబడతాయి' అని బెదిరిస్తున్నారు. దీంతో కొందరు గదుల యజమానులు అగ్రిమెంట్లను రద్దు చేసుకుంటున్నారు. మద్యం షాపుల కోసం అధిక బాడుగలు ఇచ్చేందుకు వ్యాపారులు సిద్ధమైనా టీడీపీ నేతలకు భయపడి దుకాణాలు ఇవ్వలేని పరిస్థితిలో యజమానులు ఉన్నారు.

☛ వింజమూరి కృష్ణారెడ్డి అనే తెలంగాణ వాసి షాపు నెంబర్ 22 దక్కించుకున్నాడు. పంచలింగాలలో ప్రారంభించాలనుకున్నాడు. అయితే విష్ణువర్ధన్ రెడ్డి అనుచరులు ఫోన్ చేశారు. 'ఎవరిని అడిగి దరఖాస్తు చేసుకున్నారు. కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి రాజకీయం చేస్తున్నాం. దుకాణం వదిలి పెట్టి వెళ్లండి!' అంటూ బెదిరించారు. దుకాణం కోసం గది అద్దెకు ఇచ్చిన వ్యక్తిని బెదిరించారు. దీంతో అతను అగ్రిమెంట్‌ను రద్దు చేసుకున్నారు. అద్దెకు గదులు ఇవ్వకుండా స్థానికులపై ఒత్తిడి తెచ్చారు. దీంతో కృష్ణారెడ్డి మంత్రి నారా లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు. 'తెలంగాణలో 50 అప్లికేషన్లు వేస్తే దుకాణం రాలేదు. ఇక్కడ 40 అప్లికేషన్లు స్నేహితులం కలిసి వేశాం. మావి చిన్న ప్రాణాలు. బంగారు తాకట్టుపెట్టి బతుకుదామని స్నేహితులం కలిశాం. రూ.80 లక్షల దరఖాస్తులకు ఖర్చయింది. రూ.10.85 లక్షలు లైసెన్స్‌ఫీజు కట్టాం. ఇప్పుడు దుకాణం వదిలిపోవాలంటే ఎలా అన్నా!' అని కృష్ణారెడ్డి వాపోయారు.

జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షాలు

- వెల్దుర్తిలో అత్యధికంగా 51 మి.మీ వర్షపాతం నమోదు



కృష్ణగిరి మండలం పుట్లూరు సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వంక

కర్నూలు(అగ్రికల్చర్): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావం వల్ల జిల్లాలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురిశాయి. జిల్లా మొత్తంగా సగటున 19 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా 51 మి.మీ, అత్యల్పంగా 3.8 మి.మీ వర్షపాతం నమోదైంది. వెల్దుర్తిలో 51 మి.మీ, దేవనకొండలో 49.6, కృష్ణగిరిలో 49.2, కల్లూరులో 39, కర్నూలు అర్బన్‌లో 30.2, కర్నూలు రూరల్‌లో 28, పత్తికొండలో 27, ఓర్వకల్‌లో 24.8, చిప్పగిరిలో 24.8, ఆస్పరిలో 22 మి.మీ ప్రకారం వర్షాలు కురిశాయి. మిగిలిన మండలాల్లోనూ ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ విభాగం హెచ్చరించిన నేపథ్యంలో గురువారం ఉదయం 11, మధ్యాహ్నం 12, 01, 02 గంటల సమయాల్లో కూడా వర్షపాతం వివరాలు సేకరించారు. అయితే ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జిల్లా సగటున 1.4 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదు అయింది. వాయుగుండం ఫలితంగా జిల్లాలో ఈ నెల 15 నుంచి 17 వరకు 29 మి.మీ వర్షపాతం నమోదైంది. అక్టోబరు నెల సాధారణ వర్షపాతం 60.4 మి.మీ ఉండగా... ఇప్పటి వరకు 66.2 మి.మీ వర్షపాతం నమోదు అయింది. ఈ వర్షాల వల్ల చేతికి వచ్చిన పంటలు దెబ్బతింటుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మహనీయుడు వాల్మీకి మహర్షి



వాల్మీకి మహర్షికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, వాల్మీకి సంఘం నేతలు తదితరులు

- కలెక్టర్, వాల్మీకి, బీసీ సంఘాల నేతలు

కర్నూలు(సెంట్రల్): ఆది కావ్యం రామాయణాన్ని మానవాళికి అందించిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన వాల్మీకి మహర్షి జయంతి కార్యక్రమానికి కలెక్టర్‌తోపాటు పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌కుమార్, వాల్మీకి, బీసీ సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరయ్యాయి. ముందుగా జ్యోతిప్రజ్వలన చేసిన అనంతరం ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ..వాల్మీకి మహర్షి ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని కల్మశం లేనిజీవితం గడిపేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వాల్మీకులు, వెనుకబడిన వర్గాలప్రజలు సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత స్థానంలో స్థిరపడ్డాలన్నారు. కొందరు ప్రజా సంఘాల నేతలు వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్, కమ్యూనిటీ హాల్ నిర్మాణాలను ప్రస్తావించారని, ఇందులో తన పరిధిలో ఉన్న అభివృద్ధి పనులను చేపట్టడానికి ముందుంటాని చెప్పారు. అనంతరం అంతర్జాతీయ పారా ఒలింపిక్స్‌లో ప్రతిభ కనబరచిన రామాంజనేయులు, నేషనల్ జూనియర్ వెయిట్ లిఫ్టింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిన వీరేష్‌ను సన్మానించారు. వాల్మీకి సంఘాల నాయకులు బాల సంజన్న, గూడూరు గిడ్డయ్య మాట్లాడుతూ..జిల్లాలో అనేకమంది ఎమ్మెల్యేలు, ఎంపీలను వాల్మీకులు ఓట్లు వేసి గెలిపిస్తే ఒక్కరూ వాల్మీకి జయంతి కార్యక్రమానికి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ముందు గౌరీ గోపాల్ ఆసుపత్రి సర్కిల్‌లోని వాల్మీకి విగ్రహానికి కలెక్టర్, టూరిజం శాఖ డైరెక్టర్ ముంతాజ్, బీసీ సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఏపీ సివిల్ సప్లయ్ డైరక్టర్ మహేష్‌నాయుడు, ఏపీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరక్టర్ రామాంజనేయులు, వాల్మీకి సంఘాల నాయకులు తలారి కృష్ణమ్మనాయుడు, బేతం కృష్ణుడు, కుబేరస్వామి, సత్రం రామకృష్ణుడు, శ్రీనివాసులునాయుడు, కప్పట్రాళ్ల బొజ్జమ్మ, సాంబశివరావు, బీసీ సంఘాల నాయకులు నక్కలమిట్ట గడ్డం రామకృష్ణ, దేవపూజ ధనుంజయాచారి, బత్తుల లక్ష్మీకాంతయ్య పాల్గొన్నారు.

పెంటావాలెంట్ వ్యాక్సిన్ కొరత

- రెండు నెలలుగా చిన్నారులకు అందని వైనం
- ఇదిగో అదిగో అంటున్న అధికారులు



పెంటావాలెంట్ వ్యాక్సిన్

కర్నూలు(హాస్పిటల్): బుడిబుడి అడుగుల చిన్నారులకు కాస్త ఓపిక చేసుకుని టీకాలు వేయిస్తే భవిష్యత్‌లో వారిని అవిటివారు కాకుండా కాపాడుకోవచ్చు. క్రమం తప్పకుండా వారికి వ్యాక్సిన్ వేయిస్తే ప్రాణాంతక వ్యాధులు రాకుండా రక్షించవచ్చు. ఈ పరిస్థితుల్లో పెంటావాలెంట్ వ్యాక్సిన్ రెండు నెలలుగా వేయకపోవడంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. వారికి సకాలంలో టీకాలు అందించాల్సిన అధికారులు ఈ విషయంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 98 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 18 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 622 సబ్‌సెంటర్లు, 44 అర్బన్‌హెల్త్ సెంటర్లు, మూడు ఏరియా ఆసుపత్రులు, రెండు బోధనాసుపత్రులు ఉన్నాయి. వీటన్నింటిలో ప్రతి బుధ, శనివారాల్లో వ్యాక్సిన్ డే నిర్వహించి చిన్నారులకు, గర్భిణిలకు టీకాలు వేస్తున్నారు. ఈ మేరకు అన్ని ఆరోగ్య కేంద్రాలకు రాష్ట్ర ప్రభుత్వం దాదాపుగా అన్ని రకాల వ్యాక్సిన్లను సరఫరా చేయాల్సి ఉంది. ఈ మేరకు జిల్లాలో ప్రతి సంవత్సరం 55వేల నుంచి 60 వేల మంది చిన్నారులకు టీకా వేస్తారు. కానీ గత రెండు నెలలుగా ఉమ్మడి జిల్లాలో పెంటావాలెంట్ వ్యాక్సిన్ అందడం లేదు. ఈ వ్యాక్సిన్ వేయకపోతే వారికి డిప్తీరియా, టెటనస్, కోరింత దగ్గు, హెపటైటిస్-బీ, హీమోఫిలస్ ఇన్‌ఫ్లూయింజా వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. ఈ విషయమై జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగవరప్రసాద్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పెంటావాలెంట్ వ్యాక్సిన్ ఉత్పత్తి సరిగా లేదని, ఈ కారణంగానే సరఫరా ఆగిపోయిందని, శుక్రవారం నాటికి కర్నూలు జిల్లాకు 15వేల డోసులు, నంద్యాల జిల్లాకు 10వేల డోసులు వ్యాక్సిన్ వస్తుందని తెలిపారు.

గిరిజన సం'క్షేమం'.. మరింత జాప్యం


- ఇన్‌చార్జీల పాలనలో చిన్న చితకా పనులు సైతం ఆలస్యం
- రెగ్యులర్ అధికారి లేక ఇక్కట్లు
- 20 ఏళ్లలో 13 మంది ఇన్‌చార్జ్ అధికారులే
- మృతి చెందినా, రిటైర్డు అయినా భర్తీ కాని పోస్టులు

కర్నూలు(అర్బన్): గిరిజన సంక్షేమ శాఖలో రెగ్యులర్ అధికారి లేకపోవడంతో పాలన గాడి తప్పింది. చిన్న చితకా పనులకు కూడా నెలల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 2004 నుంచి ఇప్పటి వరకు (దాదాపు 20 ఏళ్లు) 30 మందికి పైగా అధికారులు గిరిజన సంక్షేమ శాఖలో విధులు నిర్వహించారు. అయితే వీరిలో కేవలం తొమ్మిది మంది మాత్రమే రెగ్యులర్ అధికారులు కావడం గమనార్హం. ప్రస్తుతం ప్రస్తుతం సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రంగలక్ష్మీదేవి గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ అధికారిణిగా కొనసాగుతున్నారు. రెండు దశాబ్దాల్లో మెజారిటీగా ఇన్‌చార్జ్ అధికారుల పాలనలోనే గిరిజన సంక్షేమ శాఖ కొనసాగడంతో పనుల్లో తీవ్ర జాప్యం నెలకొనడంతో పాటు పాలనలో కూడా అనేక లోటుపాట్లు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఏదైనా సమస్య వస్తే రెగ్యులర్ అధికారి ఉంటే తన పరిధిలోని సంబంధిత సమస్యకు పరిష్కారం చూపుతారు. వీలైతే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చూపుతారు. తమ పరిధిలో పరిష్కరించే సమస్యను కూడా పలువురు ఇన్‌చార్జ్ అధికారులు 'మనకెందుకులే ... వచ్చే వారు చూసుకుంటారు' అనే ధోరణిని ప్రదర్శించడంతో పలు సమస్యలు పెండింగ్‌లో పడుతున్నట్లు తెలుస్తోంది. మరి కొన్నింటిని ఏకంగా డైరెక్టరేట్‌కు సిఫారసు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

➡ ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఒక గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు తాను 2022-24లో బీఎడ్ పూర్తి చేశానని, బీఎడ్ అర్హతను తన సర్వీస్ రిజిష్టర్‌లో ఎంట్రీ చేయాలని ఈ ఏడాది జూన్ 19వ తేదీన జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో లేఖ అందజేశాడు. అయితే నేటికి ఆయన ఎస్‌ఆర్‌లో బీఎడ్ ఎంట్రీని సంబంధిత అధికారి ధ్రువీకరించలేదు.

➡ ఇంటర్మీడియెట్, టీటీసీ అర్హతతో విధులు నిర్వహిస్తున్న మరో ఉపాధ్యాయుడు తాను డిగ్రీ ఉత్తీర్ణత సాధించానని, ఎస్‌ఆర్‌లో డిగ్రీ అర్హతను ఎంట్రీ చేయాలని ఈ ఏడాది మార్చి నెలలో దరఖాస్తు చేసుకున్నా, నేటికి అధికారి ధ్రువీకరణతో ఎంట్రీ చేయలేదు.

➡ పాలెంచెరువు ఆశ్రమ పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్ ఈ ఏడాది జూన్ నెలలో పదవీ విరమణ చేశారు. తుగ్గలి ఆశ్రమ పాఠశాలల్లో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న రామయ్య అనారోగ్యంతో ఈ ఏడాది మే నెలలో మృతి చెందారు. అయితే నేటికి ఆయా పాఠశాలల్లో హెచ్‌ఎం పోస్టును భర్తీ చేయలేదు. ఇదేమిటంటే సీనియారిటీ జాబితా తయారు చేస్తున్నట్లు చెబుతున్నారు.



జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయం

ఇంక్రిమెంట్లలోనూ ఇబ్బందులే ...

గిరిజన సంక్షేమ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, సీఆర్‌టీలు, ఇతర ఉద్యోగుల ఇంక్రిమెంట్లు విషయంలోనూ పలు ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని ఉద్యోగులు వాపోతున్నారు. ఇంక్రిమెంట్లకు సంబంధించి డీడీఓ లెటర్ ఇస్తే సరిపోతుందని, అయితే కేవలం తమను ఇబ్బంది పెట్టేందుకు వ్యక్తిగతంగా ప్రతి నెల దరఖాస్తు చేసుకోవాలని చెబుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సర్వీస్ రెగ్యులరైజేషన్, ప్రొబేషన్ డిక్లరేషన్‌లో కూడా అనేక మంది ఇబ్బందులకు గురైనట్లు సమాచారం.

మెమోలు జారీ చేశాం



పలువురు ఉపాధ్యాయులు విద్యార్హతలను సర్వీస్ రిజిష్టర్‌లో ఎంట్రీ చేసే విషయంలో జరిగిన జాప్యానికి ముగ్గురు సెక్షన్ అసిస్టెంట్లకు మెమోలు జారీ చేశాం. ఇంక్రిమెంట్ల విషయంలో ఎవరిని ఇబ్బంది పెట్టడం లేదు. తమ పరిధిలో ఉన్న వాటిని రెండు, మూడు రోజుల్లో అధికారి దృష్టికి తీసుకుపోతున్నాం.

– సీమోన్, పర్యవేక్షకులు, గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయం

రెగ్యులర్ అధికారి లేక అనేక ఇబ్బందులు



జిల్లా గిరిజన సంక్షేమ శాఖకు రెగ్యులర్ అధికారి లేక పోవడం వల్ల అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోక జాప్యానికి గురవుతున్నాయి. విద్యార్హతలను సర్వీస్ రిజిష్టర్‌లో ఎంట్రీ చేసేందుకు కూడా నెలల తరబడి జాప్యం జరుగుతోంది. ప్రొబేషన్ డిక్లరేషన్, సర్వీస్ రెగ్యులరైజేషన్ కూడా పలువురు ఇబ్బందులు పడుతున్నారు. పదోన్నతులకు సంబంధించిన ఫైల్ కూడా పెండింగ్‌లోనే ఉన్నట్లు తెలుస్తోంది. దశాబ్ద కాలంగా ఇన్‌చార్జ్ అధికారులే ఉండడం వల్ల తమ సొంత శాఖల్లోని పని ఒత్తిడి కారణంగా అనేక సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుపోయి పరిష్కరించలేక పోతున్నారు.

– ఆర్ చంద్రప్ప, టీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు

క్లుప్తంగా

45 రోజులు దాటినా అర్జీని పట్టించుకోలేదు

● అధికారులు నిర్లక్ష్యంపై డీఆర్వో ఆగ్రహం

కర్నూలు(సెంట్రల్): సీఎంఓ నుంచి వచ్చిన అర్జీని 45 రోజులు దాటినా కనీసం ఓపెన్ చేయకపోవడంపై డీఆర్వో కె.చిరంజీవి హౌసింగ్, టిడ్కో, రెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్నూలుకు చెందిన రామ్మూర్తి అనే వ్యక్తి తనకు టిడ్కో గృహం కేటాయించాలని సీఎంఓలో అర్జీ ఇచ్చారు. ఆ అర్జీని అధికారులు కనీసం ఓపెన్ చేసి చూడలేదు. నిర్దేశించిన సమయం మించిపోవడంతో అర్జీ రీఓపెన్‌లోకి వెళ్లిపోయింది. ఈ విషయాన్ని ఆలస్యంగా గ్రహించిన డీఆర్వో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరణ కోరుతూ సంబంధిత అధికారులకు షోకాజ్ నోటీసు ఇవ్వాలని ఆదేశించారు.

ఎస్కేయూలో పీజీ కోర్సులకు 19న స్పాట్ అడ్మిషన్లు

కర్నూలు కల్చరల్: అనంతపురం శ్రీకృష్ణ దేవరాయ యూనివర్సిటీలో 2024–25 విద్యా సంవత్సరానికి పీజీ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్లు వర్సిటీ ప్రవేశాల సంచాలకులు ఆచార్య జి.నరసింహన్ తెలిపారు. ఈనెల 19వ తేదీన నేరుగా ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. పీజీ ఎంట్రెన్స్ టెస్ట్ –2024లో అర్హత సాధించి, ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు వర్సిటీలోని అడ్మిషన్ డైరెక్టర్ కార్యాలయంలో హాజరు కావాలని తెలిపారు. అడ్మిషన్ పొందిన విద్యార్థులు కోర్సు ఫీజును అదే రోజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

పాముకాటుకు మహిళ మృతి


మృతి చెందిన జరీషమ్మ

కోసిగి: మండల పరిధిలోని జంపాపురం గ్రామానికి చెందిన జరీషమ్మ (30) పాము కాటుకు గురై మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో చర్చి వెనుక గుడిసెలో జరీషమ్మ, భర్త మునీ, ముగ్గురు పిల్లలతో నివాసం ఉంటున్నారు. బుధవారం రాత్రి భోజనం చేసి నిద్రించగా రాత్రి సమయంలో పాము కాటు వేసింది. వెంటనే లేచి చూసే సరికి పాము కనిపించడంతో కుటుంబసభ్యులు ఆ పామును చంపేశారు. స్థానిక ప్రైవేటు వైద్యుడి వద్ద చికిత్స చేయించి పరిస్థితి విషమంగా ఉండడంతో కోసిగి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రానికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించగా అప్పటికే జరీషమ్మ మృతి చెందింది. ఆమె ఆకస్మిక మృతితో కుమారుడు, ఇద్దరు ఆడపిల్లలు తల్లి లేని వారయ్యారు.

ఆర్టీసీ బస్సు.. బైక్ ఢీ

● ఫార్మసీ విద్యార్థిని మృతి


కీర్తి (ఫైల్)

నంద్యాల: పట్టణ శివారులోని శాంతిరాం ఆసుపత్రి సమీపంలో గురువారం ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్న ఘటనలో ఫార్మసీ విద్యార్థిని మృతిచెందారు. ట్రాఫిక్ సీఐ మల్లికార్జున తెలిపిన వివరాల మేరకు.. శ్రీశైలం నియోజకవర్గ పరిధిలోని వెలుగోడుకు చెందిన కీర్తి ఫార్మసీ రెండో సంవత్సరం చదువుతుంది. గురువారం ఈమె సోదరుడితో కలిసి పాణ్యంలో తమ బంధువుల వివాహానికి బయలుదేరింది. మార్గమధ్యంలో శాంతిరాం ఆసుపత్రి వద్ద నంద్యాల నుంచి బనగానపల్లెకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది.ఈ ఘటనలో కీర్తి అక్కడికక్కడే మృతి చెందగా సోదరుడు చరణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇదేమి మద్దతు!

● శనగలకు కేంద్రం ప్రకటించిన మద్దతు ధర రూ.5,650
● క్వింటాలు శనగలు పండించేందుకు అవుతున్న వ్యయం రూ.5170
● రేయింబవళ్లు కుటుంబ సభ్యులతో కలిసి కష్టిస్తే వచ్చే నికరాదాయం రూ.480 మాత్రమే
● వాతావరణ పరిస్థితులు సహకరిస్తేనే వచ్చే లాభం ఇది
● మద్దతు ధరపై రైతుల్లో వెల్లువెత్తుతున్న ఆందోళన



కర్నూలు(అగ్రికల్చర్): రబీలో జిల్లాలో ప్రధానంగా సాగు చేసే పంట శనగ. నల్లరేగడి నేలలు ఎక్కువగా ఉండడం వల్ల శనగ సాగు అధికంగా ఉంటోంది. పెట్టుబడి వ్యయం ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయింది. కనీస మద్దతు ధర మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. క్వింటాలు శనగలు పండించడానికి అవుతున్న పెట్టుబడి వ్యయం రూ.5170. ఇది వ్యవసాయ అధికారుల లెక్క. 2024 రబీలో పండించే శనగకు కేంద్రం ప్రకటించిన మద్దతు ధర రూ.5650 మాత్రమే. రేయింబవళ్లు కుటుంబసభ్యులతో కలిసి కష్టించిన రైతు మద్దతు ధర ప్రకారం శనగలు అమ్ముకుంటే క్వింటాలుకు వచ్చే లాభం కేవలం రూ.480 మాత్రమే. 2023 రబీలో పండించిన శనగలకు ప్రకటించిన మద్దతు ధర రూ.5440 ఉంది. ఈ మద్దతును కేంద్రం రూ.210 పెంచి రూ.5650గా ప్రకటించింది. పెట్టుబడి వ్యయంతో పోలిస్తే మద్దతు ధర నిరాశజనకంగా ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుత రబీ సీజన్‌లో శనగ సాగు ముమ్మరంగా సాగుతోంది. పంట చేతికి వచ్చే సమయానికి మద్దతు కంటే ధరలు పడిపోయే ప్రమాదం కూడా ఉంది. ధరలు పడిపోతే రైతుకు వచ్చే అంతంత మాత్రం నికరాదాయం కూడా పడిపోతుంది. దీంతో శనగ రైతుకు నష్టాలు తప్పడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

హెక్టారుకు పెట్టుబడి వ్యయం రూ.62,030

జిల్లాలోని ఆలూరు, కర్నూలు, పత్తికొండ, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లో నల్లరేగడి నేలలు ఎక్కువగా ఉన్నాయి. ఈసారి జిల్లాలో 70 వేల హెక్టార్లలో శనగ సాగు కానుంది. హెక్టారుకు రూ.62030 పెట్టుబడి వ్యయం అవుతుందని వ్యవసాయ యంత్రాంగం శాస్త్రీయంగా అంచనా వేసింది. శనగ సాగులో వినియోగించే యాంత్రీకరణ ఖర్చు రూ.13,154 వరకు వస్తుంది. లేబర్ ఖర్చు రూ.7900 వరకు వస్తుంది. ఇన్‌పుట్స్ అంటే రసాయన ఎరువులు, పురుగు మందులు, సూక్ష్మ పోషకాలు తదితర వాటికి అయ్యే ఖర్చు రూ.13476 వరకు ఉంటుంది. యాంత్రీకరణ, లేబర్ ఖర్చులు, ఇన్‌పుట్స్‌పై పెట్టే పెట్టుబడి, ఇతర ఖర్చులు కలుపుకుని రూ.39530 వరకు ఉంటుంది. నిజానికి పెట్టుబడి వ్యయం ఇదే. పెట్టుబడి వ్యయానికి వడ్డీ కలుస్తుంది. కుటుంబ సభ్యులు రేయింబవళ్లు రెక్కలు వంచి కష్టం చేస్తారు. పెట్టుబడి వ్యయంలో కుటుంబ సభ్యుల రెక్కల కష్టానికి కూడా విలువ కడతారు. పెట్టుబడి వ్యయంపై వడ్డీ, కుటుంబ సభ్యుల కష్టం విలువ రూ.22500 ఉంటుంది. వెరసి శనగ సాగులో హెక్టారుకు అవుతున్న పెట్టుబడి వ్యయం రూ.62030 వరకు ఉంటుందని వ్యవసాయ శాఖ అంచనా..

హెక్టారుకు సగటు దిగుబడి 12 క్వింటాళ్లే

శనగ సాగులో హెక్టారుకు సగటున 12 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. అది కూడా వాతావరణ పరిస్థితులు సహకరించినప్పుడే. మద్దతు ధరతో అమ్ముకుంటే రైతుకు రూ.67,800 వస్తుంది. ఇందులో పెట్టుబడి వ్యయాన్ని మినహాయిస్తే రైతుకు వచ్చే నికరాదాయం కేవలం రూ.5770 మాత్రమే ఉంటుంది. శనగ దిగుబడులు మార్కెట్‌లోకి వచ్చే సమయానికి ధరలు మద్దతు కంటే పడిపోయే ప్రమాదం ఉంది. అంటే రైతులకు వచ్చే నికరాదాయం మరింత తగ్గుతుంది. వాతావరణ పరిస్థితులు సహకరించక పోతే రైతుకు నష్టం కూడా వచ్చే అవకాశం ఉంది. రేయింబవళ్లు కుటుంబసభ్యులతో కలిసి కష్టించిన రైతులకు చివరికి మట్టే మిగులుతున్నట్లు స్పష్టం అవుతోంది.

రూ.7వేలు మద్దతు ధర ప్రకటించాలి



శనగలకు కనీస మద్దతు ధర రూ.7వేలుగా నిర్ణయించాలి. అప్పుడే రైతుకు భరోసా లభిస్తుంది. పెట్టుబడి వ్యయంతో పోలిస్తే కేంద్రం ప్రకటించిన మద్దతు ధర రూ.5650 ఏమాత్రం గిట్టుబాటు కాదు. ప్రస్తుత ప్రభుత్వమే రైతులకు పంపిణీ చేస్తున్న శనగల ధరను రూ.9400గా నిర్ణయించింది. హెక్టారులో శనగ సాగుకు పెట్టుబడి వ్యయం రూ.70 వేల వరకు ఉంటుంది. మద్దతు ధర రూ.7000 ఉంటేనే రైతుకు గిట్టుబాటు అవుతుంది. ఈ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. – **రామకృష్ణ, జిల్లా కార్యదర్శి, ఏపీ రైతు సంఘం**

రేపు జాబ్‌మేళా

కర్నూలు(అర్బన్): హజారి గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదిన జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు (శారీరక దివ్యాంగులు, బధిరులు) శిక్షణ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ ఎంపిక శిబిరాన్ని (జాబ్‌మేళా) నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిస్ ఫాతిమా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కర్నూలు నగర శివారుల్లోని పంకజ్ ఫ్యాషన్ అర్ట్స్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ కార్యాలయంలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అభ్యర్థులు 10వ తరగతి ఉత్తీర్ణులై, 18 నుంచి 30 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న వారు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు తమ పేరును ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల్లోపు నమోదు చేసుకోవాలన్నారు. ఈ శిబిరంలో ఎంపికైన అభ్యర్థులకు కర్నూలు, హైదరాబాద్, విజయవాడ పరిసర ప్రాంతాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 7396324464, 9000775098 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ముగ్గురిపై పిచ్చికుక్క దాడి

బేతంచెర్ల: మండలపరిధిలోని గోరుమాను కొండ సమీపాన ఉన్న బీసీ రెసిడెన్సియల్ స్కూల్ వద్ద గురువారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. స్కూల్ ఆవరణలోకి వెళ్లి పదోతరగతి చదువుతున్న వినయ్, 9వ తరగతి చదువుతున్న అభిషేక్‌తో పాటు వాచ్‌మెన్ రవిపై దాడి చేసి గాయపరిచింది. గాయాలైన ముగ్గురిని వెంటనే స్కూల్ సిబ్బంది చికిత్స నిమిత్తం స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. ఇటీవల కాలంలో పాఠశాల పరిసరాల్లోకి కుక్కలు ఎక్కువగా వస్తున్నాయని, అధికారులు వాటి కట్టడికి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మద్యం దుకాణ లైసెన్స్‌దారుల్లో గుబులు

● సిండికేట్ పంచాయితీతో తెరుచుకోని 14 దుకాణాలు
● తాత్కాలిక ప్రొవిజినల్ లైసెన్స్‌కు గడువు ఇక ఐదు రోజులే

కర్నూలు: ప్రస్తుతం లాటరీలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 204 దుకాణాలు దక్కించుకున్న వారందరికీ ఎక్సైజ్ అధికారులు ప్రొవిజినల్ లైసెన్స్ జారీ చేశారు. వాటి కాల పరిమితి వారం మాత్రమే ఉంటుంది. ఇప్పటికే రెండు రోజులు గడిచిపోయింది. మరో ఐదు రోజుల్లో దుకాణాలు తెరుచుకోవాల్సి ఉన్నా స్థానిక నేతల ఒత్తిడి వల్ల అద్దెకు షాపులు దొరకని పరిస్థితి నెలకొనడంతో లైసెన్స్‌దారులు లబోదిబోమంటున్నారు. లాటరీ పూర్తయి రెండు రోజులు గడిచినా ఇప్పటికీ నంద్యాల జిల్లాలో 8, కర్నూలు జిల్లాలో 6 మద్యం దుకాణాలు ప్రారంభం కాలేదు. ఇందుకు ప్రధాన కారణం సిండికేట్లతో వాటా పంచాయితీ తెగకపోవడమే. అయితే వారం రోజుల తర్వాత ఎక్సైజ్ అధికారులు శాశ్వత లైసెన్స్‌లు జారీ చేస్తారు. దుకాణాదారులు నిబంధనలు కచ్చితంగా పాటిస్తున్నారా లేదా ఏమైనా మార్పులు, చేర్పులు చేయాలనేది స్వయంగా ఎక్సైజ్ అధికారులు పరిశీలించాక అన్నీ సరిగ్గా ఉంటేనే ఈనెల 22న శాశ్వత లైసెన్స్‌లు జారీ చేస్తారు. గడువు సమీపిస్తున్నప్పటికీ కొన్ని నియోజకవర్గాల్లో దుకాణాలు ప్రారంభం కాకపోవడంతో లైసెన్స్‌దారులు ఆందోళన చెందుతున్నారు.

డిపో వద్ద హడావుడి...

మద్యం తీసుకెళ్లేందుకు కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఉన్న వ్యాపారులు కల్లూరు శివారులోని హంద్రీ నది ఒడ్డున ఉన్న ఐఎంఎల్ డిపో, నంద్యాలలో ఉన్న ఐఎంఎల్ డిపో వద్దకు వ్యాపారులు క్యూ కట్టారు. తమకు ఏయే సరుకు ఎంత కావాలో చలానా తీసి ఇండెంట్లు డిపో మేనేజర్‌కు అందించారు. వ్యాపారుల్లో కొందరు కొత్త ముఖాలు కావడంతో రెండు జిల్లాల్లోని ఐఎంఎల్ డిపోల వద్ద హడావుడి కనిపించింది.

అధికారుల మధ్య కార్యాలయ 'పోరు'

● దొర్నిపాడు ఎంపీడీఓ కార్యాలయ భవనంలోనే తహసీల్దార్ ఆఫీసు
● ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తాళం వేయించిన ఎంపీడీఓ


ఎంపీడీఓ సమావేశ గదికి తాళం వేసిన దృశ్యం


ఎమ్మెల్యే అఖిలప్రియ మంత్రిగా ఉన్నప్పుడు తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి భూమిపూజ చేసి ఏర్పాటు చేసిన శిలాఫలకం

దొర్నిపాడు: ప్రభుత్వ కార్యకలాపాల నిమిత్తం ప్రతి మండలంలో మండలపరిషత్, తహసీల్దార్ కార్యాలయ భవనాలు ఉంటాయి. అయితే, 2019 ఫిబ్రవరి 2న మంత్రిగా ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తహసీల్దార్ కార్యాలయానికి నూతన భవన నిర్మాణం కోసం పాత బిల్డింగ్‌ను కూల్చివేయించారు. తర్వాత ఎన్నికల కోడ్ తదితర కారణాలతో నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. దీంతో నాటి నుంచి తహసీల్దార్ కార్యాలయం మండల ప్రజాపరిషత్ భవనంలోని మూడు గదుల్లో కొనసాగుతోంది. అయితే కారణం ఏమో తెలియదు కానీ ప్రస్తుత తహసీల్దార్ సుభద్ర, ఎంపీడీఓ సావిత్రికి పొసగడం లేదు. కేటాయించిన మూడు గదులతో పాటు రెవెన్యూ అధికారులు అదనంగా తమ సమావేశ భవనాన్ని వినియోగించుకుంటూ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తున్నారని ఎంపీడీఓ గురువారం మీటింగ్ హాల్‌కు తాళం వేయించారు. ఇదిలా ఉంటే ఎంపీడీఓ మీటింగ్‌హాల్‌కు తాళం వేయడం వల్ల రెవెన్యూ సంబంధ పనుల మీద వచ్చే ప్రజలకు, తమ సిబ్బందికి ఇబ్బంది అవుతుందని తహసీల్దార్ సుభద్ర చెబుతున్నారు. నాడు హడావుడిగా కొత్త తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి శంకు స్థాపన చేసిన ప్రస్తుత ఎమ్మెల్యేనే ఈ సమస్యను పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలి

● ఎక్సైజ్ శాఖ కర్నూలు డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి


రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్

నందికొట్కూరు: రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీకే మద్యాన్ని విక్రయించాలని కర్నూలు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి అన్నారు. గురువారం పట్టణంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి మాట్లాడారు. నూతన మద్యం పాలసీ విధానంలోనే మద్యం దుకాణాలను ప్రారంభించాలన్నారు. దుకాణాదారులు ప్రతి రోజు సమయపాలన తప్పని సరిగా పాటించాలని చెప్పారు. ప్రతి మద్యం షాపు ప్రార్థన మందిరాలు, పాఠశాలలకు 100 మీటర్లు దూరంగా ఉండేలా చూడాలని ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో నాటు సారా తయారీని కట్టడి చేయాలన్నారు. ఆమె వెంట ఎక్సైజ్ శాఖ సీఐలు, ఎస్ఐలు, పోలీసులు ఉన్నారు.

పురుగు మందు తాగి ఆత్మహత్య

కర్నూలు (టౌన్): నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజీవ్ నగర్‌లో ఓ వ్యక్తి పురుగు మందు తాగి గురువారం బలవన్మరణం చెందాడు. స్థానికంగా నివసించే కృష్ణ (31) హెచ్‌డీబీ ఫైనాన్స్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంతకాలంగా మానసిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. ఈ స్థితిలో గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

కర్నూలు (టౌన్): కర్నూలు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పంచలింగాల చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రహాస్ ఆధ్వర్యంలో గురువారం తనిఖీలు నిర్వహించారు. అదే రూటులో బైక్‌పై వస్తున్న ఓ వ్యక్తిని తనిఖీ చేయగా 45 డబల్ కిక్ సుపీరియర్ విస్కీ బాటిళ్లు లభించాయి. మద్యం బాటిళ్లతో పాటు బజాజ్ ప్లాటినా ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. నిందితుడు కర్నూలు నగరంలోని గాయత్రి ఎస్టేట్‌కు చెందిన సత్యన్నపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు.

ద్విచక్ర వాహనం చోరీ

కోవెలకుంట్ల: పట్టణంలోని సాయినగర్‌లో బుధవారం అర్ధరాత్రి ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. గురువారం స్థానికులు అందించిన సమాచారం మేరకు.. కాలనీకి చెందిన దూదేకుల దస్తగిరి అనే వ్యక్తి ఇంటి ఆవరణలో బుల్లెట్, పల్సర్ ద్విచక్ర వాహనాలను పార్కు చేసి ఉంచాడు. గుర్తు తెలియని దుండగులు రెండు వాహనాలు చోరీ చేసి బనగానపల్లె రహదారివైపు వెళుతుండగా బుల్లెట్ బైక్ ఆగిపోవడంతో ఆ బైక్‌ను అక్కడే వదిలి పల్సర్ బైక్‌ను అపహరించుకెళ్లారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బైక్ చోరీ ఘటనపై విచారణ జరుపుతున్నారు.

నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు

కర్నూలు(అర్బన్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో జిల్లాలో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజనీరు వీ. రామచంద్రారెడ్డి హెచ్చరించారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ప్రాంగణంలోని పీఆర్ ఎస్ఈ కార్యాలయంలో ఆదోని డివిజన్‌కు చెందిన ఇంజినీర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ జిల్లాలో రూ.67 కోట్లతో 832 సీసీ రోడ్ల పనులు చేపడుతున్నామన్నారు. ఈ పనులకు సంబంధించి ఎలాంటి నిధుల కొరత లేదని, చేసిన పనులకు అనుగుణంగా బిల్లులను అప్‌లోడ్ చేసిన నేపథ్యంలో ప్రతి గురువారం బిల్లులు విడుదలయ్యే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం పీఆర్ ఇంజినీర్లకు ఇతరత్రా పనులు ఏవీ కూడా లేనందున, క్షేత్ర స్థాయిలో పూర్తి పర్యవేక్షణతో ఈ పనులను డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాల్సి ఉందన్నారు. సమావేశంలో ఈఈ డీసీ వెంకటేష్, డీఈఈలు బండారు శ్రీనివాసులు, హరిదాసు ఈరన్న, చంద్రశేఖర్, మనోహర్, రంగస్వామి, శేషయ్య, రాణితో పాటు ఏఈఈ, ఏఈలు హాజరయ్యారు.

ఆర్‌యూ రిజిస్ట్రార్ బాధ్యతల స్వీకరణ


డాక్టర్ బి. విజయకుమార్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం నూతన రిజిస్ట్రార్‌గా అసోసియేట్ ప్రొఫెసర్ బి. విజయకుమార్ నాయుడు గురువారం వర్సిటీలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ సముద్రాల వెంకటేశ్వర్లు వ్యక్తిగత కారణాలతో రిజిస్ట్రార్ పదవికి రాజీనామా చేశారు. దీంతో వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ వైఎస్సార్ కడప యోగి వేమన యూనివర్సిటీలోని మెటీరియల్ సైన్స్, నానో టెక్నాలజీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న విజయకుమార్ నాయుడును నూతన రిజిస్ట్రార్‌గా నియమించారు. ఈయనది కర్నూలు జిల్లా అలూరు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడతూ జిల్లా వాసిగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉన్నత విద్యాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. నూతన రిజిస్ట్రార్‌కు వర్సిటీలోని వివిధ విభాగాల ప్రొఫెసర్‌లు, టీచింగ్ ఫ్యాకల్టీ, నాన్ టీచింగ్ స్టాఫ్ అభినందనలు తెలిపారు.

18, 19 తేదీల్లో సర్టిఫికెట్ల పరిశీలన

కర్నూలు (సిటీ): కేజీబీవీ ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించి ఎంపిక చేసిన అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన ఈనెల 18,19 తేదీల్లో స్థానిక సమగ్ర శిక్ష కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందని డీఈఓ కె.శామ్యూల్ గురువారం రాత్రి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నియామకానికి సంబంధించి ప్రొవిజినల్ మెరిట్ లిస్టు ఆధారంగా ఎంపిక చేసి సబ్జెక్టు, రోస్టర్ పాయింట్ ప్రకారం జాబితాను https://rvmssakurnool.blogspot.com వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు వారి ఒరిజినల్ మార్కుల సర్టిఫికెట్లు, కుల, ఇతర ధ్రువపత్రాలను గెజిటెడ్ అధికారి ద్వారా ధ్రువీకరించి హాజరుకావాలని సూచించారు.

నేటి నుంచి గ్రామసభలు

● నవంబర్ 15వ వరకు నిర్వహణ
● రీసర్వే సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ

కర్నూలు(సెంట్రల్): గత ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసర్వేపై కూటమి ప్రభుత్వం కన్నేసింది. అవినీతి, అక్రమాలు జరిగాయన్న అనుమానంతో విచారణ పేరుతో ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణకు శ్రీకారం చుట్టింది. రీసర్వే జరిగిన ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చింది. అందులో భాగంగానే అక్టోబర్ 18 నుంచి నవంబర్ 15వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. ఈ గ్రామసభల్లో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని 15 రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

255 గ్రామాల్లో రీసర్వే పూర్తి

కర్నూలు జిల్లాలో మొత్తం 476 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఇందులో మూడు విడతల్లో 255 గ్రామాల్లో రీసర్వే జరిగింది. మొత్తం మూడు విడతల్లో కలిపి 2,86,352 రాళ్లను పాతి రైతులకు భూహక్కు పత్రాలను ఇచ్చారు. ఈ క్రమంలో ప్రభుత్వం మారడంతో మిగతా గ్రామాల్లో రీసర్వేపై మీమాంస నెలకొంది. రీసర్వే కొనసాగుతుందా లేదా అన్న విషయంపై రైతులు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

ఎలాంటి సమస్యలపై ఫిర్యాదులు ఇవ్వొచ్చు

రీసర్వేలో భాగంగా రైతులకు ఉన్న సందేహాలను నివృత్తి చేసుకోవడానికి గ్రామసభలో ఫిర్యాదు చేయవచ్చు. ఏ సమస్య ఉన్నా తెల్ల కాగితంపై రాసి ఇస్తే దానిపై సర్వే, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా విచారణ జరుపుతారు.

- భూమి విస్తీర్ణంలో తేడాలుంటే ఫిర్యాదు చేయవచ్చు
- ఒకే సర్వే నంబర్‌లో అన్నదమ్ముల భాగాలను విడిగా చేసుకోవడం కోసం అర్జీ ఇవ్వొచ్చు
- ఎల్‌పీ నంబర్లపై అనుమానం ఉన్నా ఫిర్యాదు చేయవచ్చు
- భూహక్కు పత్రాలు ఇవ్వకున్నా ఫిర్యాదు చేయవచ్చు
- తప్పొప్పులను సరిచేయాలని అర్జీలు ఇవ్వచ్చు.

15 రోజుల్లో పరిష్కారం



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రీసర్వే జరిగిన గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. నవంబర్ 15వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహిస్తాం. గ్రామసభల్లో వచ్చిన ఫిర్యాదులకు 15 రోజుల్లో పరిష్కారాలు చూపుతాం. గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. – **మునికన్నన్, ఏడీ, సర్వే**